క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం, సత్యవరం సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అనకాపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అరట్లకోట, మంగవరం, ఎం.ఎస్.పేట, సత్యవరం, గోపాలపట్నం, పెద్దిపాలెం, పెంటకోట, శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, కేశవరం, రాజవరం, వెంకటనగరం, పీఆర్‌బీపురం, పాల్తేరు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు పుట్‌బాల్స్‌ను అందజేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొమ్ము సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. గ్రామానికి చెందిన ఈ మహేష్ రెండు పుట్‌బాల్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. దాతల సహకారం సద్వినియోగం చేసుకుని విద్య, క్రీడల్లో మంచి ప్రతిభ కనబరచాలన్నారు.

ఘనంగా సాయిబాబా మందిరం వార్షికోత్సవం



సాయిబాబా సన్నిధిలో మహిళల కోలాటం

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రం వద్ద గల షిర్డీ సాయిబాబా మందిరం 7వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు, భజనలు, కోలాటాలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా సన్నిధిలో భక్తులు ప్రత్యేక హారతినిచ్చారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంఈవో



మురకాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈవో సూర్యారావు

రాంబిల్లి: మండలంలో మురకాడ, రజాల, కట్టుబోలు పాఠశాలలను గురువారం ఎంఈవో ఎం. సూర్యారావు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మన బడి నాడు–నేడు పథకంలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతతో పనులు జరిగేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఎంఈవో ఉపాధ్యాయులకు సూచించారు.

'కేంద్రం విధానాలతో దేశానికి నష్టం'

పాయకరావుపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ వనరులను తాకట్టు పెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోక్‌నాథం విమర్శించారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలను అనుసరిస్తున్న బీజేపీని సాగనంపుదాం అనే నినాదంతో వామపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నం తగదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బొలేపల్లి వెంకటరమణ, సీపీఎం నాయకుడు అప్పలరాజు, రైతు సంఘం నాయకుడు జగ్గారావు, సీపీఐ నాయకులు అర్జునరావు, సుబ్బలక్ష్మి, శివప్రసాద్ పాల్గొన్నారు.

నేడు తాళ్లపాలేనికి వైవీ సుబ్బారెడ్డి

కశింకోట : మండలంలోని తాళ్లపాలేనికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రానున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. గ్రామంలో జరిగే జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా హాజరుకానున్నట్టు వెల్లడించారు. వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించనున్నట్టు పేర్కొన్నారు.

మెరిసిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

కోటవురట్ల : ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు మెరిశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రతిభను చాటారు. ప్రథమ సంవత్సర ఫలితాలలో షేక్ ముషారపుల్ ఇస్లాం(ఎంపీసీ) 450 మార్కులు, పెట్ల రేవతి (సీఈసీ) 428, ఐ.నిఖిత (బైపీసీ) 385, ఒకేషనల్‌లో సిహెచ్. పల్లవి (ఎంపీహెచ్‌డబ్ల్యు) 465 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బి.పూజ (ఎంపీసీ) 959 మార్కులు, సి.హెచ్.జగదీష్ (ఎంపీసీ) 934, పి.మరియమ్మ (సీఈసీ) 922, ఎస్.దేవి చిన్నారి (బైపీసీ) 921, కె.విజయలక్ష్మి (ఎంపీహెచ్‌డబ్ల్యు) 939 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ కొండబాబుతో పాటు అధ్యాపక బృందం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

ఇంటర్ పరీక్షలలో కేజీబీవీ విద్యార్థినుల సత్తా

కోటవురట్ల: ఇంటర్ పరీక్ష ఫలితాలలో కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి, రెండో సంవత్సర పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి కీర్తిని తీసుకొచ్చారు. మొదటి సంవత్సరంలో 16 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరు కాగా 13 మంది ఉత్తీర్ణతతో 81.25 శాతం వచ్చినట్టు ఎస్‌వో సరోజినీదేవి తెలిపారు. ఆర్.అనూరాధ 407, ఎస్.భవానీ 365, షేక్ రజియా 362 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్టు తెలిపారు. రెండో సంవత్సర పరీక్షలలో 17 మంది విద్యార్థినులు హాజరు కాగా 14 మంది ఉత్తీర్ణతతో 82.3 శాతం సాధించినట్టు తెలిపారు. కె.ఆర్.ఎస్ రిషిత 924, పి.రమణమ్మ 886, కె.భవానీ 835 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను అభినందించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అచ్యుతాపురం కేజీబీవీ విద్యార్థులు సత్తా చాటారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 19 మంది హాజరు కాగా 13 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 25 మంది పరీక్షల రాయగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో భాగంగా కె.విజయ వర్ధినికి వేయికి 945 మార్కులు, జి.మౌనికకు 936 మార్కులు లభించాయి. మొదటి సంవత్సరం ఫలితాల్లో భాగంగా జి.ఇందుకు 440 మార్కులకు 398, కె.తరంగిణి 440 మార్కులకు 369 మార్కులు సాధించి సత్తా చాటారు.

మట్టిలో మాణిక్యాలు

- కష్టపడ్డారు సాధించారు
- ఇంటర్‌లో గ్రామీణ విద్యార్థుల సత్తా

యలమంచిలి : వారంతా గ్రామీణ ప్రాంతంలో సాధారణ రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివి ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ సత్తా చాటారు. పట్టణంలోని ఉషోదయ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ ప్రతిభ చూపారు. సోమలింగపాలెం గ్రామానికి చెందిన పి.లహరిప్రియ 1000 మార్కులకు 983 మార్కులు ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సాధించింది. ఈమె తండ్రి సాధారణ రైతు, తల్లి సంతోషికుమారియలమంచిలిలో సచివాలయ మహిళా పోలీసుగా పనిచేస్తున్నారు. కుమార్తె పరీక్ష ఫలితాలపై ఆనందం వ్యక్తం చేశారు.

ఎంపీసీలో 981 మార్కులు

రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మంచి మార్కులు సాధించింది. ఈమె తండ్రి నానాజీ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ జయశ్రీని చదివిస్తున్నాడు, పేదరికం అడ్డురాకుండా విద్యపట్ల ఇష్టం పెంచుకొని జయశ్రీని చదివించడం ద్వారా ఇటీవలే ఇంటర్మీడియట్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాంబిల్లి మండలం గోకివాడ గ్రామానికి చెందిన ఎం. పావని ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 980 మార్కులు సాధించింది.



రోహిణికి స్వీట్ తినిపిస్తున్న తల్లి చంద్రమణి



లహరిప్రియను అభినందిస్తున్న తల్లి సంతోషికుమారి

ఆమె తండ్రి కాసులు నాయుడు వ్యవసాయ కూలీగా ఉంటూ తన కుమార్తెను చదివిస్తున్నారు. ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు.



సాయి సాత్విక్ (ఎంపీసీ ఫస్టియర్) 458

బైపీసీలో 978 మార్కులు

యలమంచిలి తులసీనగర్‌కు చెందిన ఎం.రోహిణికి తండ్రి లేకపోయినా తల్లి చంద్రమణి టైలరింగ్ చేస్తూ ఇంటర్ చదివించింది. పేదరికం వెంటాడినా చదువుపట్ల రోహిణి ఏకాగ్రత చూపి ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 978 మార్కులు సాధించింది.

ప్రథమ సంవత్సరంలో సాయి సాత్విక్ 458 (ఎంపీసీ), కె.గాయత్రి 457 (ఎంపీసీ), ఎం.లక్ష్మిప్రియ 445 (ఎంపీసీ) మార్కులు, సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఆయా విద్యార్థులను గ్రామస్తులు, కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

కిరణ్‌చంద్‌కు విద్యార్థుల శ్రద్ధాంజలి



కిరణ్‌చంద్ మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తున్న వమ్మవరం పాఠశాల విద్యార్థులు

ఎస్.రాయవరం : చిన్న వయసులో అకాల మరణం చెంది అవయవ దానం చేసిన కిరణ్ చంద్ కీర్తి చిరస్థాయిగా నిలుస్తుందని వమ్మవరం మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నారు. పాఠశాలలో గురువారం కిరణ్ చంద్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిరణ్‌చంద్ 10వ తరగతి చదువుతూ బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబీకులు అతని అవయవాలు దానం చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా కిరణ్‌చంద్ మృతికి సంతాపంగా పాఠశాల విద్యార్థులు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.

పూర్వ విద్యార్థుల వితరణ



రూ. 1.50 లక్షల బాండ్‌ను అందిస్తున్న టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

రాంబిల్లి : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సహచర పూర్వ విద్యార్థి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. రజాలకు చెందిన దువ్వాడ మోహన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మోహన్‌కు ఏడాదిన్నర పాప, ఆరేళ్ల బాబు ఉన్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించే మోహన్ మృతితో ఆయా కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు 2001 టెన్త్ బ్యాచ్ ముందుకొచ్చింది. వీరికి 2001 బ్యాచ్ జూనియర్స్, సీనియర్స్ చేయూత నిచ్చారు. వీరినందరినీ బండి శ్రీనివాసరావు, తుమ్మపాల కొండలరావు, బొద్దపు మధు సమన్వయం చేసి రూ 1.50 లక్షలు సమీకరించి పాప పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను మోహన్ భార్యకు అందజేశారు.

జగనన్న పాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకుంటే తన దృష్టికి తీసుకురావాలని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) అన్నారు. అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఈ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దిబ్బపాలెం పరిధిలో సంక్షేమ పథకాలను లబ్ధిదారునికి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

8న జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ

ఎస్.రాయవరం : మత్స్యకార గ్రామాలైన రేవుపోలవరం, కొత్త రేవుపోలరం గ్రామాల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం యువకులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఎస్ఐ ప్రసాద్‌రావు అన్నారు. గ్రామాల ఇలవేల్పు అయిన శ్రీ బంగారమ్మతల్లి జాతరను పురస్కరించుకుని నిర్వహించే వాలీబాల్ టోర్నీ కరపత్రాలు ఎస్ఐ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. జాతరను పురస్కరించుకుని మే 8న రాత్రి టోర్నీ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు చెప్పారు. క్రీడాకారులు తమ వారి జట్ల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొవిరి బంగారి, వైఎస్సార్‌సీపీ నాయకులు గనగళ్ల రాజేష్ ,అప్పలరాజు, గోవిందు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రసాద్‌రావు

కొండకర్ల, దోసూరులలో ప్రచార భేరి



ప్రచార భేరి పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, దోసూరు గ్రామాల్లో సీపీఎం నాయకులు గురువారం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పనులు చేపడుతున్న ఉపాధి హామీ కూలీలతో సీపీఎం నాయకులు ఆర్.రాము, సోమునాయుడు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా ప్రచార భేరి పోస్టర్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, నూకరాజు, భవానీ, పార్వతమ్మ పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై వీఓఏలకు శిక్షణ



లోకోస్ యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న వెలుగు అధికారులు

ఎస్.రాయవరం : స్వయం సహాయక సభ్యురాలు వ్యక్తిగత సమాచారం లోకోస్ యాప్ ఎలా పొందు పరచాలో పూర్తి స్థాయిలో వీఓఏలు శిక్షణ తీసుకోవాలని ఏపీఎం శివప్రసాద్ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం 69 మంది వీవోఏలకు శిక్షణ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో లోకోస్ యాప్‌లో సభ్యురాలికి అవసరమైన సమాచారం ఉంటుందన్నారు. సభ్యురాలు వ్యక్తిగత సమాచారం, సంఘ సమాచారం, వీఏవో సమాచారం ఎలా పొందుపరచాలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు సత్యవతి, రమణబాబు, వీర్రాజు, పైడియ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల్లో పారదర్శకత కోసం లోకోస్ యాప్

మునగపాక(అనకాపల్లి): జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం ద్వారా అమలవుతున్న అన్ని ప్రభుత్వ పథకాలను ఒకే గొడుకు కిందికి తీసుకొచ్చేందుకు లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని మండల సమాఖ్య ఏరియా కో–ఆర్డినేటర్ ధర్మారావు తెలిపారు. మునగపాక మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం వీఓఏలకు, సీసీలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగించనున్నారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత ఉండాలనే లోకోస్ యాప్‌ను వినియోగిస్తున్నామని తెలిపారు. ఏపీఎం కొండమ్మ, మండల సమాఖ్య కార్యదర్శి మరిడమ్మ, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఎంపీ నిధులు రూ.22 లక్షలు మంజూరు

- వేసవి కార్యాచరణ, శ్మశానాల్లో వసతుల పెంపు

కశింకోట : మండల గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణ, శ్మశానాల్లో సదుపాయాలు మెరుగుపరిచేందుకు రూ.22 లక్షల నిధులను తన ఎంపీ కోటా నుంచి మంజూరు చేసినట్లు ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ఎంపీ కోటా నిధులు వెచ్చిస్తున్నట్టు పేర్కొన్నారు. మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా బోర్ల ఏర్పాటుకు రూ.13 లక్షలు కేటాయించామన్నారు. శ్మశాన వాటికల్లో వసతుల మెరుగుకు రూ.9 లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో అడ్డాం, పేరంటాలపాలెం, జోగారావుపేట, నాయుడుపాలెం, ఏఎస్ పేట, జమాదులపాలెం, తేగాడ, లాలంకొత్తూరు శ్మశానాల్లో బోర్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. త్వరలో షెడ్లు, ప్రహరీలు, ప్లాట్ ఫారాల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ కలగా లక్ష్మిల సూచనల మేరకు ఈ నిధులను మంజూరు చేశామన్నారు. ఇతర మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఎంపీ నిధులు కేటాయించడానికి చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

స్వల్పంగా తగ్గిన కూరగాయల ధరలు

కశింకోట : కశింకోటలో సూర్య తాపంతో గురువారం ప్రజలు విలవిలలాడారు. గత కొద్ది రోజులుగా కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. దీంతో ఇక్కడి వారపు సంత వెలవెలబోయింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో కొనుగోలుదారులు లేక దుకాణాలు ఖాళీగా కనిపించాయి. ఎండ వేడిమితో సరైన నీడ లేక దుకాణదారులు ఇబ్బందిపడ్డారు. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కొనుగోలుదారుల రాకతో దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. కూరగాయల ధరలు కాస్త తగ్గాయి. టమాటా కిలో రూ.10కి విక్రయాలు సాగాయి. గత వారం వరకు నాణ్యతను అనుసరించి రూ.15 నుంచి రూ.20 ఉండేది. ఈ వారం రూ.10కి తగ్గింది. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.20, వంకాయలు రూ.30, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ, దొండకాయ రూ.40, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. పచ్చి మామిడి కాయ ఒక్కొక్కటి రూ.10కి విక్రయించారు.



కశింకోట వారపు సంతలో ఎండ తీవ్రతతో వెలవెలబోతున్న దుకాణాలు

సోషల్ ఆడిట్‌పై ఒక్కరోజు శిక్షణ



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

నక్కపల్లి : సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని, పాఠశాలల్లో జరుగుతున్న పనులు, ఇతర కార్యక్రమాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్ కోరారు. గురువారం ఆయన మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సోషల్ ఆడిట్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో అమలవుతున్న వివిధ కార్యక్రమాల నిర్వాహణ తీరును పరిశీలించడానికి ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలల పనితీరు, మూల్యాంకనం ద్వారా సమస్యలు గుర్తించి పాఠశాల అభివృద్ధిని మెరుగుపరచుకోవడానికి ఇది దోహద పడుతుందన్నారు. పాఠశాలల్లో లింగ అసమానతలను తగ్గించడం, బాల్యవివాహాల నిర్మూలన, మధ్యలో బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించడం వంటి అంశాలపై పనితీరు మూల్యాంకనం ద్వారా గుర్తించడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. దీనిలో భాగంగా 77 అంశాలతో కూడిన ఒక యాప్‌ని రూపొందించడం జరిగిందన్నారు. పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఆ యాప్‌లో ప్రధానోపాధ్యాయులు విధిగా పూర్తిచేయాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్ పి.వి.సన్యాసినాయుడు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వై.వి.అప్పారావు, కృష్ణమోహన్, పుష్యరాగం, ప్రతాప్, త్రివేణి, సిఆర్‌పిలు డి.అప్పారావు, బందం జ్యోతి, అప్పలనాయుడు, గంగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై ముమ్మర ప్రచారం



పట్టణంలో పథకాల అమలుపై ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో నాయకులు ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్తు నువ్వే జగన్ అనే నినాదంతో నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. పట్టణంలో గల పలు ప్రాంతాల్లో జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు పట్ల లబ్ధిదారులు అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీల్లో ప్రచారం నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు బ్రోచర్‌లను పంపిణీ చేస్తున్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మరలా జగన్‌మోహన్ రెడ్డికే అందరం మద్దతు తెలిపాలని ప్రజల్ని కోరుతూ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.టి.నాయుడు

పాయకరావుపేట : స్థానిక శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు వారం రోజులుగా సీతారాంపురంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.టి.నాయుడు ఈ నెల 21వ తేదీ నుంచి ఈ గ్రామంలో వ్యాధులపై అవగాహన ర్యాలీ, స్వచ్ఛ భారత్, దోమల నిర్మూలనపై శానిటేషన్ కార్యక్రమం, కంటి వైద్య శిబిరం, డెంగ్యూ వ్యాధి, ధూమపానం, మద్యపానం నిర్మూలనపై ర్యాలీలు, నిరుద్యోగ యువతపై సర్వే, లింగ సమానత్వంపై ర్యాలీ, మొదలగు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఈ సందర్భంగా తెలిపారు. ఎంపీఎంపీ స్కూల్ హెచ్ఎం రాఘవులు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమంలో పాల్గొని దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ పి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ యరిడయ్య, గ్రామ పెద్దలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పనితీరు మెరుగుపడాలి

డీపీవో శిరీషరాణి

నక్కపల్లి : గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పనితీరు ఇంకా మెరుగుపడాలని చాలా చోట్ల ఇంకా పనులు ప్రారంభం కావడం లేదని డీపీవో శిరీష రాణి అన్నారు. గురువారం ఆమె నక్కపల్లి, ఉద్దండపురం గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ చేసే విషయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ వేరు చేసి వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



నక్కపల్లిలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక(అనకాపల్లి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ అనిల్ కుమార్ అన్నారు. మునగపాక మండలం మూలపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామాలకు వైద్య సేవలు మరింత విస్తరించాయని అన్నారు. ప్రస్తుత వేసవి కాలం కావడంతో బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సర్పంచ్ గంగ అప్పలనాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీహెచ్‌ఎల్ పురంలో చలివేంద్రం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్



చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నక్కపల్లి : మండలంలో చుక్కల వాని లక్ష్మీపురంలో సర్పంచ్ కర్రి భవానీ రాజబాబు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవి కాలంలో తాగునీటి కోసం ఇబ్బంది పడేవారిని దృష్టిలో ఉంచుకుని ప్రధాన కూడలి వద్ద చలివేంద్ర ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు. సీహెచ్‌ఎల్ పురం మీదుగా వెళ్లే జానకయ్యపేట, చిన తీనార్ల, పెద తీనార్ల, దొండవాక గ్రామాల వారికి ఈ చలివేంద్రం దాహార్తి తీరుస్తుందన్నారు.

పందూరులో...

కోటవురట్ల : పందూరు గ్రామ పంచాయతీ వద్ద గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మొదటి రోజున మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రధాన కూడళ్లలో స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.